# బఫెలో హాంటర్స్



MVS PUBLICATIONS

## మధుబాబు

# బఫెలో హంటర్స్

(ఎ షాడో ఎడ్వెంచర్)

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# బఫెలో హంటర్స్

"ముఖేష్ ఎక్కడ ఉన్నాడు?" సి.ఐ.బి. హెడ్ క్వార్టర్స్‌లో అడుగుపెడుతూనే ప్రశ్నించింది బిందు.

బొటనవేలితో కులకర్ణిగారి గదివైపు చూపించింది రిసెప్షనిస్ట్ బెట్టీ. "బీ కేర్‌ఫుల్ బిందూ. బాస్ యీ రోజు పచ్చిమిరపకాయ బజ్జీలు తిని వచ్చినట్లుంది..." అని హెచ్చరించింది లోగొంతుకతో.

హేండ్‌బాగ్‌ని భుజానవేసుకుని, కులకర్ణిగారి గదిలోకి పోయింది బిందు.

టేబుల్ ముందు నిలబడి, సిగార్ పొగని గుప్పుగుప్పున వదులుతూ, భారం భారంగా డైలాగులు విసురుతున్నారాయన. పంక్చువాలిటీ అనే పదానికి వుండాల్సిన విలువను ముఖేష్ శ్రీకర్‌లకు వినిపిస్తున్నారు.

"వేరీజ్ దట్ బిగ్ మంకీ?" బిందును చూడగానే మరింతగా ప్లేరప్ అయ్యారాయన. అవుతుండగానే టేబిల్ మీద వున్న బ్లూ కలర్ టెలీఫోన్ అదేపనిగా మ్రోగటం ప్రారంభించింది.

తేలికగా నిట్టూర్చి ముఖేష్ ప్రక్కన కూర్చుంది బిందు.

విసుగ్గా చూస్తూ రిసీవర్‌ను అందుకున్నారు కులకర్ణి. అవతలినుంచి వినవచ్చిన మాటల్ని ఆలకించి, "ఆల్ రైట్... యిప్పుడే బయలుదేరుతున్నాను" అంటూ రిసీవర్‌ని క్రెడిల్ చేశేశారు.

"బిందూ రాజు ఎక్కడ?" లోగొంతుకతో బిందును ప్రశ్నించబోతున్న ముఖేష్ ఆయన తమవైపు తిరగటాన్ని గమనించి, సీరియస్‌గా చూడసాగాడు గోడలమీద ఉన్న కాలెండర్లను.

"హోమ్ మినిస్టర్ గారి దగ్గిరికి పోయి పదిహేను నిముషాల్లో తిరిగివచ్చేస్తాను. వచ్చిమీతో మాట్లాడవలసిన విషయాలు చాలా వున్నాయి. నేను వచ్చేదాకా యిక్కడే వుండండి. ఈ గదిని దాటి ఒక్క అడుగుకూడా అవతలికి వెయ్యకూడదు" కుర్చీమీద వున్నకోటును అందుకుంటూ హెచ్చరించి, బయటికి వెళ్ళిపోయారాయన.

"అమ్మయ్య... తుఫాను వెలిసింది. ఇక కొంచం గట్టిగా మాట్లాడుకోవచ్చు..." అంటూ బిందువైపు తిరిగాడు శ్రీకర్.

"దయచేసి కొంచెం నోరు మూసుకుంటావా?" సీరియస్‌గా అడిగింది బిందు.

"ఇదెక్కడి గోలరా నాయనా! పులిపోయి భూతంపట్టిందిట" అనబోయి బిందు మరింత సీరియస్‌గా ఉరిమిచూసేసరికి ఠపీమని నోరు మూసుకున్నాడతను.

హేండ్‌బేగ్‌ని తెరిచి రెండు ట్రైన్ టిక్కెట్లను తీసివారికి యిచ్చింది బిందు. "రాజు కలకత్తాలో వున్నాడు. మీ యిద్దర్నీ అర్జెంటుగా కలకత్తా పంపమని కబురుచేశాడు. బాస్‌కి తెలియకుండా ముందు యిక్కడినుంచి తప్పించుకోండి" అంది గది బయటవున్న సులోచనకి వినిపించకుండా.

చటుక్కున కుర్చీలోంచి లేచాడు శ్రీకర్.

"నూరేళ్ళు వర్ధిల్లు సిస్టర్. నీ ఋణం యీ జన్మలో తీర్చుకోలేను..." అంటూ గది బయటకు పోయి ఒక కారిడార్‌లో అదృశ్యం అయ్యాడు.

ఎందుకు? ఏమిటి అన్న ప్రశ్నలు అతని హృదయంలో అడుగుపెట్టనేలేదు. షాడో కలకత్తాలో ఉన్నాడు. తమని వెంటనే రమ్మనమని కబురుచేశాడు. అంతే.

రెండు నిముషాలు ఆగి మెల్లగా ఆ గదిని వదిలాడు ముఖేష్.

"జాగ్రత్త...ముందు గుమ్మంలో వాసు నిలబడి వున్నాడు. చూశాడంటే నిన్ను వదిలిపెట్టడు" లో గొంతుకతో హెచ్చరించింది బిందు.

ఏదో ఫైలును చదువుతున్నది కులకర్ణిగారి సెక్రటరీ సులోచన. అడుగులు ఎత్తిఎత్తి వేస్తూ చల్లగా జారుకుంటున్న ముఖేష్‌ని గమనించి "ఎక్కడికి?" అని గద్దించింది.

"మా నాయనమ్మ వచ్చిందిట. వాసు ఫోన్ చేశాడు పోయి మాట్లాడివస్తాను" అమాయకంగా సమాధానం ఇచ్చాడు ముఖేష్.

అలాగా అన్నట్లు చూసి, ఫైలులో తలదూర్చింది సులోచన. ఆ మరుక్షణమే ముఖేష్ మాటలకు పూర్తి అర్థం ఆమెకు తెలిసివచ్చింది.

"ముఖేష్... మర్యాదగా వెనక్కివస్తావా, బాస్‌కి ఫోన్ చేసి చెప్పమంటావా?" అంటూ కుర్చీలోంచి లేచింది.

అప్పటికే క్రింది అంతస్థులోకి వెళ్ళిపోయాడు ముఖేష్. ముఖద్వారం ముందు నిలబడివున్న వాసు దగ్గరికిపోయి "వాసూ...సులోచన పిలుస్తోంది... పోయిరా. నేను నిలబడతాను యిక్కడ" అన్నాడు.

మాటలు మార్చటం చేతకాని అమాయకుడు వాసు. హడావుడిగా బయలుదేరాడు సులోచన దగ్గిరికి.

అతన్ని నాలుగు అడుగులు వేయనిచ్చి రోడ్డుమీదికి పరుగుతీశాడు ముఖేష్. ఎదురువచ్చిన టాక్సీని ఆపి, "సెంట్రల్ స్టేషన్‌కి అర్జెంటుగా పోనీ" అని ఆర్డర్ యిచ్చాడు.

* * *

"మనకు సంబంధంలేని పని యిది. స్పెషల్ బ్రాంచి వాళ్ళకు తెలిస్తే, వాళ్ళ విషయాల్లో తల దూరుస్తున్నామని గోలగోల చేయగలరు. కలకత్తా పోలీస్ డిపార్టుమెంట్‌కి తెలిస్తే – శాంతి భద్రతలకు ముప్పుకలిగిస్తున్నామని కోర్టుకు ఎక్కించి, మూడు మూడులు తొమ్మిది సంవత్సరాలు కటకటాల వెనక్కి తోయగలరు. బాస్‌కి తెలియకుండా రమ్మనమని కబురుపెట్టటానికి కారణం యిది" పనామా పొగల్ని రింగులు రింగులుగా వదులుతూ అన్నాడు షాడో.

"యూ డోన్ట్ వర్రీ గురూ...బాస్‌కికాదు బ్రహ్మదేవుడికి కూడా తెలియదు మన విషయం" నాలుక చప్పరిస్తూ పెద్దగా అన్నాడు శ్రీకర్.

అటుగా పోతున్న పోలీస్ కానిస్టేబుల్ చటుక్కున ఆగి విచిత్రంగా చూశాడు అతనివంక, నాలుక కొరుక్కుంటూ ముఖేష్ చాటుకు జరిగాడు శ్రీకర్.

"ఇటువంటి లౌడ్ స్పీకర్లని వెంటబెట్టుకుని బయలుదేరితే యిక సవ్యంగా జరిగినట్లే పనులు..." అతని నెత్తిమీద ఒకటి అంటిస్తూ కోపంగా అన్నాడు ముఖేష్.

నవ్వుతూ రైల్వేస్టేషన్ బయటికి దారితీశాడు షాడో. ఒక టాక్సీని పిలిచి బాలీగంజ్ పోనీయమని చెప్పి ఫ్రంట్ సీటులో కూర్చున్నాడు.

అసలు విషయం ఏమిటో అడుగుదామని మహా తపనపడి పోతున్నాడు శ్రీకర్. తిరిగి నోరుతెరిస్తే మరో మొట్టికాయ పడుతుందనే భయంతో కామ్‌గా టాక్సీ ఎక్కి వెనక సీట్లో ఆసీనుడైనాడు.

అరగంట తరువాత బాలీగంజ్ సెకండ్ కార్నర్‌లో ఆగింది టాక్సీ. ఒక పెద్ద రావిచెట్టు ఉంది, అక్కడికి వందగజాల దూరంలో దానిక్రింద నిలబడి కబుర్లు చెప్పుకుంటున్న పది మంది దృఢకాయులు టాక్సీని చూడగానే మాటల్ని ఆపి, మెల్లిగా ముందుకురావటం ప్రారంభించారు.

"గురూ... కంపెనీ వస్తోంది" టాక్సీ డ్రయివర్‌కి మీటర్ చార్జి యిస్తూ లోగొంతుకతో షాడోని హెచ్చరించాడు ముఖేష్.

చేతిలోవున్న సిగరెట్‌ని నేలమీద పడేస్తూ టాక్సీడ్రయివర్‌కి సైగచేశాడు షాడో. బ్రతుకుజీవుడా అనుకుంటూ యాక్సిలేటర్ మీద కాలువేశాడు డ్రయివర్. దృఢకాయులు షాడో ముఖేష్ శ్రీకర్‌లను సమీపించేసరికి రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళిపోయింది టాక్సీ.

"ఏ వూరు బే మనది?" బీడిపొగను షాడో ముఖంమీదికి వదులుతూ ప్రశ్నించాడు ఒక దృఢకాయుడు.

పళ్ళు కొరుకుతూ ముందుకు అడుగు వేయబోయాడు శ్రీకర్. వెంటనే అతనిచేతిని పట్టుకొని కదలవద్దని సైగచేశాడు ముఖేష్.

బాలీగంజ్ వంటి రౌడీ ఏరియా కలకత్తాలో మరొకటి లేదు. రౌడీయిజం చెలాయించటానికి కారణాలు అవసరం లేదు. బాలీగంజ్ రౌడీలకు. దారినపోయే వారందర్నీ ఏడిపించి, వీలు అయితే జేబులు ఖాళీచేసి పంపటం వారికి ఒక వినోదం.

"ఏం బే కుర్రాడా? పళ్ళుకొరికి మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నావా?" శ్రీకర్ బుగ్గలమీద చిటికెవేస్తూ అడిగాడు మరో దృఢకాయుడు.

సలసల మరుగుతున్నది శ్రీకర్ నరాల్లోని నెత్తురు. ఆ దృఢకాయుడి పళ్ళు రాలగొట్టాలన్న కోరిక అతని హృదయాన్ని పట్టి పీడిస్తోంది.

షాడోవంకే చూస్తున్నాడు ముఖేష్ అతనలా కామ్‌గా నిలబడి వుండటానికి ఏదో కారణంవుండే వుంటుందని అతనికి తెలుసు.

"సాబ్ – మేము ఢిల్లీనుంచి వస్తున్నాం. ఇక్కడవుండే గుర్బక్ వస్తాదుకు బంధువులం. అడ్రసు సరిగ్గా తెలియకపోవటంవల్ల వీధులన్నిటినీ గాలిస్తున్నాం" ముఖం మీదికి వస్తున్న బీడిపొగను చూడనట్లు నటిస్తూ సమాధానం యిచ్చాడు షాడో.

ఒకరిముఖం ఒకరు చూసుకొని పెద్దగా నవ్వారు ఆ దృఢకాయులందరూ.

"ఆ తీన్ తేరా గాడికి బంధువులా? అదిగో ఆ మూలమీద వున్న ఇరానీ హోటల్‌లో విచారించండి. పొండి." అంటూ లాగిపెట్టి శ్రీకర్ వెన్నుమీద చరిచాడు ఒక దృఢకాయుడు.

ముందుకు పడబోతున్న శ్రీకర్‌ని చెరొక ప్రక్కనుంచీ పట్టుకొని గబగబా అక్కడినుంచి తీసుకుపోయారు షాడో ముఖేష్‌లు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2022**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**